

**పెళ్లివారు పెళ్లికూతుర్ని చూడడానికి వచ్చి హాలులో కూర్చున్నారు.**

**"అమ్మాయిని తీసుకురండమ్మా...." అని పెళ్లిళ్ల పేరయ్య పెళ్ళికూతురు తల్లితో అన్నాడు పెద్ద గొంతుతో...! పెళ్లికూతురు తల్లి లోపలకెళ్లి కూతురుతో వచ్చింది.**

**బంగారు బొమ్మలా మెరిసిపోతూ పెళ్లికూతురి అలంకారాలతో కాఫీ కప్పులున్న ట్రేని చేతులతో పట్టుకుని మెల్లగా నడిచి వచ్చింది.**

"అత్తగారికి నమస్కారం చెయ్యమ్మా..." అని పేరయ్యగారు అనగానే సుకన్య ట్రే కింద పెట్టి నమస్కారం చెయ్యబోతున్న వరుని తల్లిని చూడగానే సుకన్యకు నెత్తిన పిడుగు పడ్డట్లయింది.

"రాజేశ్వరి... డాక్టర్ రాజేశ్వరి వరుని తల్లా..." అన్న తన భయాన్ని మొహంలో కనపడకుండా జాగ్రత్తపడి కాబోయే అత్తగారి కాళ్లకు నమస్కరించి అందరికీ కాఫీలిచ్చి లోపల కొచ్చేసింది.

"అబ్బాయ్, అమ్మాయిని బాగా చూశారా...?" అని పేరయ్య వరుని అడగ్గానే, కొడుకు తల్లిని చూసి "ఏం అంటావమ్మా?" అని అడిగాడు.

తల్లి డాక్టర్ రాజేశ్వరమ్మ దృఢసంకల్పంతో "ఆ... బాగా చూశాను" అన్నది.

ఆమె అన్న ప్రతీ మాట లోపలున్న సుకన్య మనసులోకి బాంబులా ప్రవేశించి పేలింది.

అసలు నిజం చెప్పాలంటే ఆ పెళ్లిచూపులు ఏదో లాంఛన ప్రాయమే...! ఒకే ఆఫీసులో ఉద్యోగాలు చేస్తున్న వారిద్దరూ ఒకరి నొకరు గాఢంగా ప్రేమిం చుకుని పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నా సుందర్ అన్నీ సాంప్రదాయబద్ధంగా జరగాలన్న మాట ప్రకారం ఏర్పరచిన పెళ్లిచూపులే...!

సుందరం తల్లే డాక్టర్ రాజేశ్వరి అని సుకన్యకు తెలీదు. సుకన్యే పెళ్లికూతురని రాజేశ్వరమ్మకు తెలీదు.

సుకన్య హైద్రాబాదు హాస్టలులో ఉండి డిగ్రీ చదువుకుంటున్న రోజుల్లో డాక్టరు రాజేశ్వరి హాస్టలుకు కన్సల్టెంటు డాక్టరు.

"స్త్రీ స్వేచ్ఛ... స్త్రీ స్వాతం త్ర్యం అన్న పదాలను దుర్విని యోగ పరిచే విధంగా అమ్మా యిలు హద్దులు మీర రాదు. పాత ఆచా రాలను గౌరవిస్తూ కట్టు బాట్లలో ఉండాలి" అని హాస్టలు కొచ్చినప్పుడల్లా అమ్మాయిలకు ఉపదేశం చేస్తుంది. మీటింగు లలో కూడా ఇదే అర్థం వచ్చే

# స్త్రీ ధర్మం

ఎ. సువర్ణ

ఉపన్యాసాలు ఇస్తుంది. ఇది నేటి అమ్మాయి కెంత మాత్రం నచ్చదు.

'వాలెంటైన్స్ డే' అని ఉత్సాహంగా పిక్నిక్‌కు బయలుదేరిన అమ్మాయిలలో సుకన్య కూడా ఉంది. రోజంతా అబ్బాయిలు అమ్మాయిలు కలిసి ఆడి పాడడంతో సుకన్య రాజేష్‌లు హద్దులు మీరారు. అందుకు సుకన్య పెద్దగా ఫీలవలేదు. ఆ విషయం అప్పుడే మరిచి పోయింది కూడా!

అది జరిగిన మూడో నెలలో ఓ రోజు మెస్‌లో అన్నం తిన్న సుకన్య వాంతి చేసుకుంది. వెంటనే హాస్టల్ వార్డెన్ సుకన్యను రాజేశ్వరి క్లినిక్‌కు తీసికెళ్లింది.

సుకన్యను పరీక్ష చేసి డాక్టరు చెప్పిన సంగతి విన్న వార్డెన్ భయంతో వణికి పోయింది.

"ఓసి పాపాత్మురాలా! విద్యార్థిగా ఉండాల్సిన దానివి తల్లిగా అవుతున్నావే...! నిన్నీస్థితికి తెచ్చిన ఆ వెధవ ఎవరు... ఎక్కడున్నాడు?..." అని కేకలేసింది వార్డెన్.

"అతను.. అతను పోయిన వారం స్కూటరు యాక్సిడెంట్‌లో పోయాడు" అని వెక్కుతూ చెప్పింది సుకన్య.

"డాక్టర్ ఈమె తండ్రి స్ట్రిక్ట్ డిసిప్లీనియర్ మిలటరీ ఆఫీసరు. ఈ విషయం ఆయనకు తెలిసిందంటే కూతుర్ని తుపాకితో కాల్చి చంపేస్తాడు... ప్లీజ్ డాక్టర్... సుకన్యకు అబార్షన్ చేసి ఆమెను కాపాడండి డాక్టర్..." అని వార్డెన్ వేడుకున్నట్లుగానే రాజేశ్వరి డాక్టరుగా సుకన్యకు అబార్షన్ చేసి ప్రాణాపాయం నుంచి కాపాడింది.

అదే డాక్టరు దాదాపు నాలుగు సంవత్సరాల తరువాత...నేడు తన ప్రియుని తల్లిగా తన కొడుక్కు పెళ్లి చూపులకు వచ్చింది.

"ఏమండీ డాక్టరమ్మగారూ అమ్మాయి నచ్చిందా.... ఊరికెళ్లాక ఏ విషయం ఉత్తరం రాస్తారా..." అన్న అలవాటైన ప్రశ్న అడిగాడు పెళ్లిళ్ల పేరయ్య.

"లేదు... లేదు... మేమీ ఊరివాళ్లమేగా! ఏ ఊరెళ్లీ రాయక్కరలేదు. ఇప్పుడే ఇక్కడే చెప్పేస్తున్నాను... నాకు అమ్మాయి బాగా నచ్చింది. ముహూర్తాలు పెట్టడంలాంటి తదుపరి కార్యక్రమాలు చూడండి..." అన్న రాజేశ్వరమ్మ మాటలు సుకన్య చెవులలో అమృతధారలు జాలువారుతున్నట్లు వినపడి పులకరించింది.

మర్నాడు పొద్దున మొదటి పనిగా సుకన్య రాజేశ్వరి క్లినిక్‌కు వెళ్లింది. నేలవాలిన తీగెలా డాక్టరమ్మ కాళ్లను అల్లుకుపోయి కన్నీటితో పాదాభిషేకం చేస్తున్న సుకన్యను ఆప్యాయంగా పైకి లేవదీసింది రాజేశ్వరమ్మ.


"నిన్న మిమ్మల్ని సుందరం అమ్మగా చూసిన క్షణంలోనే నాపై ప్రాణాలు పైనే పోయాయి".

ప్రేమగా సుకన్య వీపు మీద చేతితో రాస్తూ "యూ ఆర్ కరెక్ట్... నేను నిన్న మీ ఇంటికి, నిన్ను చూడడానికి సుందరం అమ్మగానే వచ్చాను. డాక్టరుగా కాదు. డాక్టరు వృత్తికని ఓ ధర్మం ఉంది. ఆ రోజు నువ్వు నా దగ్గరకు పేషెంటుగా వచ్చావు. డాక్టరు తన దగ్గర వైద్యం చేయించుకున్న పేషెంటు రహస్యాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ఎవరికీ చెప్పకూడదు. ఎవరి ముందు బహిరంగపరచకూడదు. అలా చేస్తే పవిత్రమైన డాక్టరు వృత్తికి ద్రోహం చేసిన వాళ్లవుతారు" అన్న డాక్టరు చెప్పిన వివరణకు సుకన్య పులకించిపోయింది.

"నేను చేసిన పాపానికి దేముడు దండన విధించాడు. కానీ మీరు...! ఆ రోజు దేవుడిలా నన్ను కాపాడారు. ఈ రోజు నేను చేసిన పొరపాటుని పెద్ద మనసుతో క్షమించి నాకు జీవితాన్ని ప్రసాదించారు. డాక్టర్ మీ మేలు ఎన్ని జన్మలకు మరిచిపోనిది..." అని వెక్కి వెక్కి ఏడుస్తున్న కోడలు కళ్ల నిండా నిండుకున్న నీళ్లను తన అమృత హస్తాలతో తుడుస్తూ... "నో ...నో... డాక్టరు కాదూ..! అత్తయ్య అని పిలవాలి." అని నవ్వింది సుకన్యను చూసి డాక్టర్ రాజేశ్వరి. ❋

## రాగ సుధారసం..!!

వీణను శృతి చేసి
వేణువును ఊదుతూ..
సప్తస్వరాలు ఆలపించె..!!
రాగాలు అనురాగాలై..
పల్లవిగా పలికె..!
నాదం వేదనాదమై..
ఓంకారం ప్రతిధ్వనించె..!!
ఆలాపనల మాధుర్యం..
అనురాగ మాలికల తోరణం..!!
తన్మయత్వానికి లేదు అంతం..



అదొక సరిగమల సాగర మథనం..
అనంత విశ్వానికి అది
రాగసుధారసం..!!

- తంగెళ్ల పాండురంగశర్మ

